

ఉమ్మడి జిల్లాలో అత్యల్ప ఉష్ణోగ్రతలు

జిల్లా	ప్రాంతం	ఉష్ణోగ్రత (డిగ్రీల్లో)
వికారాబాద్	మోమిన్‌పేట్	8.5
రంగారెడ్డి	మంగల్‌పల్లి	9.0
మేడ్చల్	కొండాపూర్	10.8



స్వర్ణ భారత్ ట్రస్టు ఆధ్వర్యంలో

ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలంలోని ముచ్చింతల్ గ్రామ శివారులోని స్వర్ణభారత్ ట్రస్టు, అటల్జీ వృత్తి నైపుణ్య శిక్షణ సంస్థ, జీకే పెన్నార్, హీరో మోటో కార్ప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 24 నుంచి టూ వీలర్ ప్రివెంటివ్ మెయింటెనెన్స్ రిపేర్ కోర్సులో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ట్రస్టు ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శిక్షణ కాలం పూర్తి చేసుకున్న అభ్యర్థులకు హీరో మోటో కార్ప్ సర్వీస్ సెంటర్స్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు 7893131973, 9963277544 నంబర్లలో సంప్రదించాలని కోరారు. ఉచితంగా భోజనం, వసతి సౌకర్యం కల్పించబడుతుందన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా అర్హత కలిగిన వారు 19-35 సంవత్సరాల్లోపు వయసు కలిగి ఉండాలన్నారు. శిక్షణ కాల పరిమిత 64 రోజులు ఉంటుందని తెలిపారు.



ఇష్టారాజ్యంగా డిప్యూటేషన్లు..
విద్యార్థుల అగచాట్లు 8



బుగ్గ క్షేత్రం..
భక్త జనసంద్రం 8



పడిపోయిన పప్పు

ఏటేటా తగ్గుతున్న సాగు విస్తీర్ణం

ఆకాశాన్నంటుతున్న అపరాల ధరలు.. పంటలపై ఆసక్తి చూపని రైతులు

అవగాహన కల్పించడంలో అధికారులు విఫలం

జిల్లాలో పప్పుదినుసుల సాగు ఏయేటికాయేడు గణనీయంగా తగ్గుతోంది. పత్తిపంటను అధికంగా సాగు చేయడం, ఆపై కరువు కారణంగానే పప్పుదినుసుల పంటల సాగు విస్తీర్ణం పడిపోతుంది. పప్పులను విక్రయిస్తే పత్తి పంట కంటె రెట్టింపు లాభాలు వస్తాయని రైతులకు అవగాహన కల్పించడంతో అధికారులు విఫలమవుతున్నారు. దీంతో పప్పులను ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో పప్పుల ధరలు ఆకాశాన్నంటి సామాన్యులను బెంబేలెత్తిస్తున్నాయి. ఇప్పటికైనా పప్పుల సాగు పెంచకపోతే మున్ముందు మనుషులకు పోషకాలకు దూరమయ్యే అవకాశం లేకపోలేదు.

ప్రస్తుతం పప్పుల ధరలు ఇలా... (కిలో.. రూ.లలో)

పప్పులు	2024	2025
కంది	130	140
పెసర	120	135
శనగ	75	85
వేరుశనగ	90	120
మినుము	110	130
శనగలు	120	180

యాచారం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పప్పు దినుసుల సాగు అంతకంతకు పడిపోతోంది. దీంతో పప్పుల ధరలు నింగి నంటుతున్నాయి. పప్పులలో అనేక రకాల విటమిన్లు, ప్రొటీన్లు ఉండడంతో వాటిని సామాన్య జనం అధికంగా తినడానికి ఇష్టపడతారు. మనుషులు ఆరోగ్యంగా ఉండేందుకు పప్పులు ఎంతో దోహదపడుతాయని వైద్యులు కూడా చెబుతున్నారు. రోజూ తీసుకునే భోజనంలో కనీసం 50 గ్రాముల పప్పు దినుసులు ఉండేలా చూసుకోవాలని సూచిస్తుంటారు. అలాంటి ఈ పప్పు దినుసుల సాగు గణనీయంగా తగ్గిపోతోంది.

ఒకప్పుడు రంగారెడ్డి జిల్లాలో కంది, పెసర, శనగ, మినుములు అధికంగా సాగు చేసేవారు. అయితే పప్పుల సాగు తగ్గిపోతుండటంతో గత ఐదేళ్లగా వాటి ధరలు పెరుగుతున్నాయి. పప్పు దినుసుల సాగుతో లాభాలు వస్తాయని తెలిసినా రైతులు ఆ పంటలు వేయడానికి ఆసక్తి చూపడం లేదు. పత్తి పంట

మిగతా 8వ పేజీలో...

వేరుశనగతో లాభాలెన్నో..

వేరుశనగ తినడంతో జ్ఞాపకశక్తిని పెంపొందించే విటమిన్ బీ-3 నియాసిన్ పుష్కలంగా ఉంటుంది. అలాగే అదనంగా ఫ్లేవనాయిడ్‌గా పని చేసే రిజర్వేటరల్ మెదడుకు బాగా రక్తప్రసరణ జరగడంతో 30 శాతం మేరకు సహకరిస్తుంది. వేరుశనగలో ఉండే ట్రిప్టోఫాన్ కారణంగా సెరొటోనిన్ విడుదలై డిప్రెషన్‌కు వ్యతిరేకంగా పోరాడుతుంది. దీంతో మానవులు డిప్రెషన్‌కు లోనయ్యే అవకాశాలు చాలా తక్కువ. జుట్టు రాలడం తగ్గుతుంది. ఇందులో ఉండే విటమిన్ సీ, కొల్లాజెన్ అనే ఎంజైమ్‌ను ఉత్పత్తి చేయడం ద్వారా జుట్టు రాలడం తగ్గుతుంది. ఇందులో ఉండే ఒమెగా-3 ఫ్యాటీ ఆసిడ్స్ జుట్టు కుదుళ్లను గట్టిపరుస్తుంది. వేరుశనగను వేడిచేసి చిన్నారులకు తినిపిస్తే మంచిది. వేరుశనగ గుండె సంబంధ వ్యాధులను అదుపులో ఉంచుతుంది. వేరుశనగ నూనెకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్న సంగతి విదితమే.

నాణ్యమైన విత్తనాలందించాలి

పప్పు దినుసుల విత్తనాలు రైతులకు 75శాతం రాయితీపై అందించాలి. ముఖ్యంగా పంట సాగులో మెలకువలు రైతులకు వివరించడంతో పాటు విత్తన తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తే వరి, ఆముదం, పత్తి, పంటలకంటే రెట్టింపు లాభాలు గడించవచ్చు. ఇక్కడ పప్పు దినుసుల సాగుకు అనుకూలంగా నేలలున్నాయి. వీటి సాగుతో నీటిని పొదుపు చేయగలం.

- కె.జోగిరెడ్డి, రైతు నందివనపర్తి



రైతు సదస్సులో మాట్లాడుతున్న కోదండరెడ్డి

సాగులో సేంద్రియ ఎరువులు వాడాలి

- రైతులకు అండగా ప్రభుత్వం
- డ్రిప్‌తో వరిసాగు అభినందనీయం
- రాష్ట్ర రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి

యాచారం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతులను అన్ని విధాలా ఆదుకుంటామని, వారి సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండలంలోని చౌదర్‌పల్లిలో డ్రిప్‌తో రైతు రాములు సాగుచేసిన వరి పంటను ఆయన పరిశీలించారు. అనంతరం యాచారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వివిధ గ్రామాల రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో కోదండరెడ్డి మాట్లాడుతూ పంటలకు సోకుతున్న చీడపీడల నివారణకు రసాయన ఎరువులు, మందులకు బదులు సేంద్రియ ఎరువులు వాడితే అధిక దిగుబడి రావడంతో పాటు ఎక్కువ రోజులు పంట నిల్వ ఉంటుందని వెల్లడించారు. మారుమూల గ్రామాల రైతులకు సేంద్రియ ఎరువుల వాడకం, డ్రిప్, స్ప్రింక్లర్లతో పంటలకు నీరు అందించడంపై దృష్టి సారించాలన్నారు. రైతులు ధాన్యం, పత్తిని దళారులకు కాకుండా ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలో విక్రయించి లాభం పొందాలన్నారు. తక్కువ నీటితో డ్రిప్ ద్వారా వరిసాగు చేయడం మొదటిసారి చూస్తున్నానని, ఈ సందర్భంగా రైతు రాములును అభినందించారు. సాగు నీరందించడానికి పాలమూరు రంగారెడ్డి పనులు ముమ్మరం చేయాలని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారన్నారు. భూసమస్యలపై తహసీల్దారు కార్యాలయానికి వచ్చే రైతులను ఇబ్బంది పెట్టొద్దని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. చౌదర్‌పల్లి, గడ్డమల్లాయాగూడ, మొండిగౌరెల్లి గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా తీసుకొని కూరగాయలు, పండ్లతోటల పెంపకానికి ప్రభుత్వం అధిక రాయితీలు ఇస్తుందన్నారు. ఆయా గ్రామాల రైతులకు రూ.పది వేల విలువైన పరికరాలను ఉచితంగా అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు భవాని, ఏవీఎస్ రెడ్డి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సురేష్, జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఉష, మార్కెటింగ్ అధికారి రియాజ్, డివిజనల్ వ్యవసాయాధికారి ఎం.శ్రీలత, మండల వ్యవసాయాధికారి రవినాథ్ తదితరులున్నారు.

రాజ్యాధికారం కోసం బీసీలంతా ఏకం కావాలి

కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత తగ్గుతున్న రిజర్వేషన్లు

- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, ప్రజాస్వామ్య అగ్రవర్ణాల మద్దతు తీసుకోవాలి
- అడగకపోతే అన్ని గుంజుకుంటారు
- తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

షాబాద్ /షాద్‌నగర్ అర్బన్ /శంకర్‌పల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత రిజర్వేషన్లు తగ్గిపోతున్నాయని తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. షాబాద్‌లో 40 రోజులుగా 42శాతం బీసీ రిజర్వేషన్ల సాధన సమితి ఆధ్వర్యంలో జరుగుతున్న రిలే నిరాహార దీక్షలో గురువారం ఆమె పాల్గొని వారికి మద్దతు తెలిపారు. షాబాద్ మండల కేంద్రంలో పూలే, అంబేద్కర్, బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చాక క్రమ క్రమంగా రిజర్వేషన్లు తగ్గుతున్నాయన్నారు. గవర్నమెంట్ కంపెనీలకు రిజర్వేషన్లు అమ్ముకుంటున్నారని ఆరోపించారు. రిజర్వేషన్ల సాధన కోసం ఢిల్లీ స్థాయిలో రైల్ రోకో లాంటి ఉద్యమం చేద్దామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్లి పీఎం నరేంద్రమోదీని కలిసిన కూడా బీసీ రిజర్వేషన్ల గురించి అడగడం లేదన్నారు. జాగృతి ఆధ్వర్యంలో

మిగతా 8వ పేజీలో...

మోకిలలో కవితకు ఘన స్వాగతం

ప్రతి ఒక్కరూ దైవచింతన కల్గి ఉండాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత తెలిపారు. గురువారం మోకిలా గ్రామానికి వచ్చిన కవితకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. గురువారం శంకర్‌పల్లి మండలంలోని మోకిలా గ్రామంలో ఎల్లమ్మ, పోచమ్మ దేవాస్థానం 5వ వార్షికోత్సవం సందర్భంగా కవిత ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా గ్రామ దేవతల దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



మాట్లాడుతున్న ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

- ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య

ఇబ్రహీంపట్నం, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య జిల్లా యంత్రాంగానికి సూచించారు. గురువారం కలెక్టరేట్‌లో రెవెన్యూ, పోలీస్, ఎస్సీ, ఎస్టీ సంక్షేమాధికారులు, కుల సంఘాల నాయకులతో జరిగిన సమీక్షలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీలు ఇతర అణగారిన వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేసే గ్రామాభివృద్ధి కమిటీలను ఎంతమాత్రం ఉపేక్షించబోమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ స్టేషన్లలో ఫ్రెండ్లీ పోలిసింగ్ విధానం పక్కాగా అమలు జరిగేలా చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీ గురుకుల పాఠశాలలు, వసతి గృహాలను తరచూ తనిఖీలు చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన భోజనం, విద్య అందేలా చూడాలన్నారు. ఎస్సీ, ఎస్టీలకు సమస్యలు ఎదురైనప్పుడు కమిషన్ అక్కడకే వెళ్లి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి మాట్లాడుతూ భూ సమస్యలపై ఎప్పటికప్పుడు ఆర్డీవోలతో విచారణ చేయించి ఎస్సీ, ఎస్టీలకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. డీసీపీలు సత్యనారాయణ, పూర్ణచందర్ రావు, ఉదయ్‌రెడ్డి, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, లక్ష్మీనారాయణ, జిల్లా శంకర్, డీఆర్వో సంగీత, జిల్లా సాంఘిక సంక్షేమాధికారి రామారావు, గిరిజన సంక్షేమాధికారి రామేశ్వరీదేవి, జెడ్పీ సీఈవో కృష్ణారెడ్డి, ఆర్డీవోలు చంద్రకళ, వెంకట్‌రెడ్డి, సరిత, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

రాజశేఖర్ హత్య హేయమైన చర్య

షాద్‌నగర్‌రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): దళిత యువకుడు రాజశేఖర్ కిడ్నాప్, హత్య సమాజం తల దించుకునేలా ఉందని, ముమ్మాటికీ ఇది హేయమైన చర్య అని ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎల్లంపల్లి గ్రామాన్ని గురువారం అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, శంషాబాద్ అడిషనల్ డీసీపీ పూర్ణచందర్, షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణలతో కలిసి సందర్శించారు. రాజశేఖర్ కుటుంబ సభ్యుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు.

ఎకరాకు రూ.కోటి పరిహారం ఇవ్వాలి

- మద్రిపల్లి గ్రామ రైతుల డిమాండ్

కడ్తాల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఎకరాకు రూ.కోటి పరిహారం ఇవ్వాలని గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మాణంలో భూములు కోల్పోతున్న మద్రిపల్లి గ్రామ రైతులు డిమాండ్ చేశారు. లేదంటే భూమికి బదులు మరోచోట భూమి ఇవ్వాలని కోరారు. కడ్తాల్ మండలం మద్రిపల్లి గ్రామంలో గురువారం భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రాజు పర్యటించారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు సంబంధించి గతంలో వచ్చిన ఫిర్యాదులపై స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులు తమ అభిప్రాయాలను వివరించారు. న్యాయమైన పరిహారం అందిస్తే తప్ప గ్రీన్ ఫీల్డ్ రోడ్డుకు భూములు ఇవ్వమని తేల్చి చెప్పారు. కొంగరకలాన్‌లో ఇచ్చిన విధంగా ఎకరాకు రూ.కోటి పరిహారం అందించాలని కోరారు. ఈ మేరకు డిప్యూటీ కలెక్టర్ రాజుకు భూములు కోల్పోనున్న రైతులు వినతి పత్రం అందించారు. రైతుల అభిప్రాయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ గంగాధర్, ఎస్సై వరప్రసాద్, స్థానిక నాయకులు, రైతులు పాల్గొన్నారు.



డిప్యూటీ కలెక్టర్ రాజుకు వినతి పత్రం ఇస్తున్న రైతులు

ఉదయ్‌పూర్‌లో పెళ్లి... రెండు చార్టెడ్ విమానాలు

250 మందిని తీసుకెళ్లిన వ్యాపారవేత్త కిరణ్‌కుమార్ గ్రంధి

శంషాబాద్ రూరల్, నవంబర్ 20 (ఆంధ్రజ్యోతి) : డబ్బున్నవారు గోవా, ఉదయ్‌పూర్ ప్రముఖ ప్రాంతాల్లో పెళ్లిళ్ల, ఎంగేజ్‌మెంట్లు చేయడం ఫ్యాషన్‌గా మారింది. ఆ కోవకు చెందిన వ్యాపారవేత్తలు కిరణ్ గంధ్రి అతని సన్నిహితుడు రాజ్ మంతెన కుమారుల వివాహం ఈ నెల 23వ తేదీన ఉదయ్‌పూర్‌లో జరగనుంది. అందులో భాగంగా ఆకాష్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన రెండు చార్టెడ్ విమానాలను బుక్ చేసుకుని 250 మందిని గురువారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ఉదయ్‌పూర్‌కు తీసుకెళ్లారు. క్యూపీ 7102 విమానంలో మధ్యాహ్నం12.30గంటలకు బయలుదేరగా, మరో విమానం మధ్యాహ్నం 1.50గంటలకు బయలుదేరి వెళ్లింది. ఇటీవల నగరానికి చెందిన మేకల అయ్యప్ప అనే వ్యాపార వేత్త తన కుమారుడి ఎంగేజ్‌మెంట్ కోసం దాదాపు 500 మందిని గోవాకు తీసుకెళ్లారు. ఇప్పుడు రెండు చార్టెడ్ ఫ్లైట్లలో 250 మందిని ఉదయ్‌పూర్‌కు తీసుకెళ్లడం చర్చనీయమైంది.

చేవెళ్లలో వంద పడకల ఆస్పత్రిని నిర్మించాలి

- ఎమ్మెల్యే యాదయ్య అసమర్థత, నిర్లక్ష్యం కారణంగానే నిర్మాణంలో జాప్యం
- మాజీ ఎమ్మెల్యే కేఎస్.రత్నం ధ్వజం
- చేవెళ్లలో రిలేదీక్ష

చేవెళ్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే అసమర్థత, నిర్లక్ష్యం కారణంగానే చేవెళ్లలో వంద పడకల ఆస్పత్రి నిర్మాణం నోచుకోవడం లేదని బీజేపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే కెఎస్.రత్నం ధ్వజమెత్తారు. చేవెళ్లలో వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తూ బీజేపీ పార్టీ జిల్లా యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి, చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అనంతరెడ్డి ఆధ్వర్యంలో రిలేదీక్ష గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే కాలె యాదయ్యకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం కేఎస్.రత్నం మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేవెళ్లలో వంద పడకల ఆసుపత్రి నిర్మాణం కోసం రూ. 17.5 కోట్లు నిధులు మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వ స్థలం ఉన్నప్పటికి నిర్మాణం ఎందుకు చేపట్టలేకపోతుందో ప్రజలకు ఎమ్మెల్యే యాదయ్య సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చేవెళ్ల అభివృద్ధి కోసమే పార్టీ మారినా అని చెప్పిన ఎమ్మెల్యే యాదయ్య.. ఆయన చేసిందేమీ లేదని, తన కుటుంబం మాత్రం పబ్బం గడుపుకుంటుందని తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా గుంతల రోడ్లు దర్శనమిస్తున్నాయని, వాటి మరమ్మతుల కోసం ప్రభుత్వం నుంచి నిధులు తీసుకురావడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వమే హైదరాబాద్ - బీజాపూర్ రోడ్డుకు నిధులు మంజూరు చేసిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి గ్రామాల్లో వ్యతిరేకత ఉన్న కారణంగానే స్థానిక ఎన్నికలు నిర్వహించడంలో జాప్యం చేస్తుందన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ఆంజనేయులుగౌడ్, కంజర్ల ప్రకాశ్, మల్లారెడ్డి, జిల్లా నాయకులు కుంచం శ్రీనివాస్‌గుప్తా, మల్గారి డాక్టర్ వైభవ్ రెడ్డి, వాసుదేవకన్నా, చేవెళ్ల మండల అధ్యక్షుడు శ్రీకాంత్, మున్సిపల్ అధ్యక్షుడు అనంతరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు దేవర పాండురంగారెడ్డి, నాయకులు మిట్ట వెంకటరంగారెడ్డి, శ్రీనివాస్, కృష్ణారెడ్డి, సత్యనారాయణ, మధుకర్‌రెడ్డి, జయసింహారెడ్డి, శంకర్‌గౌడ్, శ్రీశైలం ఉన్నారు.



చేవెళ్లలో నిర్వహించిన రిలే దీక్షలో మాట్లాడుతున్న చేవెళ్ల మాజీ ఎమ్మెల్యే కేఎస్. రత్నం

సందడిగా చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న జిల్లా వైద్యాధికారి ఉమాగౌరి

మేడ్చల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఆశా కార్యకర్తలకు గురువారం ఒక్కొక్కరికి రెండు చీరల చొప్పున జిల్లా వైద్యాధికారి ఉమాగౌరి పంపిణీ చేశారు. ప్రతీ సంవత్సరం వారి సంక్షేమం కోసం ప్రభుత్వం అందించే చీరలను ఈ ఏడాది కూడా పంపిణీ చేసినట్లు డీఎంహెచ్‌వో తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు, జిల్లా ప్రాజెక్టు మేనేజరు, జిల్లా పబ్లిక్ హెల్త్ నోడల్ ఆఫీసర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహిళల రక్షణలో ప్రభుత్వాలు విఫలం



చేవెళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

చేవెళ్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మహిళలకు రక్షణ కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మమత అన్నారు. గురువారం చేవెళ్లలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. షిటీమ్స్ ఎక్కడ కూడా సరిగా పని చేయడం లేదన్నారు. మహిళలపై రోజురోజుకూ హత్యాచారాలు పెరిగిపోతున్నా ప్రభుత్వాలు స్పందించడం లేదన్నారు. దేశవ్యాప్తంగా బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలపై అధికంగా హత్యాచార ఘటనలు జరిగాయని ఆరోపించారు. కళాశాలల్లో మహిళలపై ర్యాగింగ్ ఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కేంద్రం నూతన విద్యావిధానంతో కాషాయీకరణ చేసే కుట్ర చేస్తోందన్నారు. నాయకులు ప్రణయ్, శంకర్, శ్రీకాంత్, తరంగ్, అరుణ్‌కుమార్, వంశి, సింధు, యశ్వంత్, పవన్‌కుమార్, విష్ణు, నవీన్, విష్ణుగుప్త, చరణ్‌గౌడ్ ఉన్నారు.



సంతకాల సేకరణ కమిటీ చైర్మన్‌గా

ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పరిగి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): టీపీసీసీ ఓట్ చోర్ - గద్దీ చోడ్ సంతకాల సేకరణ రాష్ట్ర కమిటీ చైర్మన్‌గా పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు టీ.రామ్మోహన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జి మీనాక్షినటరాజన్ టీపీసీసీ అధ్యక్షుడు బీ.మహేశ్‌కుమార్‌గౌడ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చైర్మన్‌గా రామ్మోహన్‌రెడ్డి, సభ్యులుగా వీర్లపల్లి శంకర్, కె.శంకర్‌నాయక్, మేడిపల్లి సత్యం, కె.పుష్పలీల, బిక్రైలేష కుమార్, అల్లం భాస్కర్‌ను నియమించారు.

ప్రజల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులే..

సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్య పద్మ



ఘట్‌కేసర్‌లో జరిగిన కార్యక్రమంలో సీపీఐ నాయకులు

ఘట్‌కేసర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పేదల పక్షాన పోరాడేది కమ్యూనిస్టులేనని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు పశ్యపద్మ అన్నారు. సీపీఐ శత వసంతాల ప్రచార బస్సు జాత గురువారం ఘట్‌కేసర్‌కు చేరుకున్నది. ఈ జాతకు ఘట్‌కేసర్, పోచారం మున్సిపాలిటీల నుంచి పార్టీ నేతలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఘట్‌కేసర్ బస్‌స్టాండ్ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలలో ఆమె మాట్లాడుతూ వంద సంవత్సరాల చరిత్రలో పార్టీ నాయకత్వం, కార్యకర్తలు అనేక త్యాగాలు చేశారన్నారు. చదువు పూర్తి చేసిన వెంటనే ఉద్యోగాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వీఎస్ బోస్, వలిఉల్లా ఖాద్రి, ఉప్పలయ్య, నరేంద్ర ప్రసాద్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే మౌలిక వసతుల కల్పన



మాట్లాడుతున్న కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్

శామీర్‌పేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వంతోనే ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు, అభివృద్ధి పనులు చేపడుతున్నామని కాంగ్రెస్ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేశ్‌యాదవ్ అన్నారు. తూంకుంట మున్సిపల్‌లో మొత్తం రూ.87 లక్షల మున్సిపల్ నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మున్సిపల్ నాలుగో వార్డులో రూ.21 లక్షలతో సీసీ రోడ్డుకు, 6వ వార్డులో రూ.14 లక్షలతో సీసీ రోడ్డుకు, 7వ వార్డులో రూ.27 లక్షలతో సీసీ రోడ్డుకు రూ.16 లక్షలతో అదనంగా మరో నూతన సీసీ రోడ్డుకు, రూ.9.5 లక్షలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీఏ సభ్యుడు జైపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ నిర్సంలుయాదవ్, ఏబ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి, కట్ట మైసమ్మ దేవాలయ చైర్మన్ మహేందర్‌యాదవ్, నాయకులు మధుసూదన్‌రెడ్డి, ఎద్దు నాగేశ్, జైపాల్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, దోసకాయల వెంకటేశ్, తుంకి రమేశ్, తుంకి భిక్షపతి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

చిన్న పిల్లల వైద్య శిబిరానికి స్పందన



పిల్లలను పరీక్షిస్తున్న చీఫ్ పీడియాట్రిక్ డాక్టర్ నాగేశ్వరరావు

శంషాబాద్, నవంబర్ 20(ఆంధ్రజ్యోతి): చిన్న పిల్లలకు గుండె సంబంధిత సమస్యలపై నిర్వహించిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. చిన్న పిల్లల్లో గుండె జబ్బులు గుర్తించి ఉచితంగా వైద్యం చేసేందుకు శంషాబాద్‌లో గురువారం అమృత ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ సంతోష్ సహకారంతో రెయిన్‌బో కార్డియాలజీ ఇనిస్టిట్యూల్ సహకారంతో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఇనిస్టిట్యూల్ డీఎం డాక్టర్ నాగేశ్వరరావు కోనేరి ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ చిన్న పిల్లల్లో గుండె సంబంధిత వ్యాధులను గుర్తించడానికి వైద్య శిబిరం నిర్వహించిన డాక్టర్ సంతోష్‌తోపాటు ఆసుపత్రి సిబ్బందిని ప్రశంసించారు.



అవార్డు అందుకుంటున్న మొగులయ్య

మొగులయ్యకు ఉత్తమ సొసైటీ చైర్మన్ అవార్డు

కులకచర్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రంగారెడ్డి జిల్లా స్థాయి ఉత్తమ సొసైటీ చైర్మన్ అవార్డును డీసీసీబీ డైరెక్టర్, కులకచర్ల సొసైటీ చైర్మన్ కనకం మొగులయ్య అందుకున్నారు. 72వ అఖిల భారత సహకార వారోత్సవాలు హైదరాబాద్‌లోని గన్‌ఫౌండ్రీలో గురువారం జరిగాయి. ఈ సందర్భంగా తెలంగాణ సహకార యూనియన్ ఆధ్వర్యంలో ఉమ్మడి నల్గొండ డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి మొగులయ్యకు అవార్డు ప్రదానం చేశారు. సొసైటీ ద్వారా ఇచ్చిన అప్పులు రికవరీ చేయడం, కొత్త అప్పులు ఇవ్వడంలో సొసైటీ అగ్రస్థానంలో ఉందని తెలిపారు. రైతులకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించినందుకు ఈ అవార్డు దక్కిందని మొగులయ్య తెలిపారు. డీసీవోలు, కులకచర్ల సొసైటీ డైరెక్టర్ కొండయ్యగౌడ్ పాల్గొన్నారు.

ఐరాసాలో బాలల హక్కులకు గుర్తింపు



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవా చీఫ్ లీగల్ అడ్వకేట్ వెంకటేశ్

ధారూరు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఐక్య రాజ్య సమితి(ఐరాస)లో బాలల హక్కులకు గుర్తింపు లభించిందని జిల్లా న్యాయ సేవా చీఫ్ లీగల్ అడ్వకేట్ వెంకటేశ్ అన్నారు. మండల కేంద్రంలోని బీసీ బాలుర వసతి గృహంలో గురువారం సాధన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రపంచ బాలల హక్కుల దినోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరై మాట్లాడారు. మానవ హక్కుల్లో భాగంగా బాలల హక్కులను పొందుపరిచినట్లు తెలిపారు. బాలలకు జీవించే, రక్షణ, అభివృద్ధి చెందే హక్కులను ఐక్యరాజ్య సమితి పొందుపరిచినట్లు చెప్పారు. బాల్య వివాహాలు, బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలన, లైంగిక వేధింపులు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో షీ టీం ఇన్‌చార్జి బుచ్చేందర్ రెడ్డి, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ విజేందర్, భరోసా ఇన్‌చార్జి రాజశ్రీ, మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం ఇన్‌చార్జి అలీమొద్దీన్, సాధన సంస్థ కో ఆర్డినేటర్లు బి.నర్సింహులు, శ్వేత, అంగన్‌వాడీ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి స్వర్ణకుమారి

వికారాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మాతాశిశు సంరక్షణకు అందిస్తున్న సేవలను తప్పని సరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి స్వర్ణకుమారి పేర్కొన్నారు. గురువారం కలెక్టరేట్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, ప్రోగ్రామ్ అధికారులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శస్త్ర చికిత్సలను తగ్గించేందుకు సాధారణ ప్రసవాల ప్రోత్సాహంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సిజేరియన్లు అధికంగా జరుగుతున్న ఆసుపత్రుల్లో ఆడిట్ నిర్వహించాలని ఆదేశించారు. జిల్లా ఆసుపత్రిలో 23 పడకల జిరియాట్రిక్ వార్డు ఏర్పాటు చేసి వృద్ధులకు ప్రత్యేక చికిత్సలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ నెల 21 నుండి డిసెంబర్ 4 వరకు జరుగుతున్న వేసెక్టమీ పక్షోత్సవాలలో ప్రతీ పీహెచ్‌సీ నుంచి కనీసం ఒక్క శస్త్ర చికిత్స చేయాలని సూచించారు. సమీక్షలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ప్రవీణ్, డాక్టర్ రవీంద్ర యాదవ్, ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ పవిత్ర, డాక్టర్ బుచ్చిబాబు, డాక్టర్ నిరోషా, డాక్టర్ గోపాల్, డిప్యూటీ డెమో శ్రీనివాసులు, పీహెచ్‌సీల వైద్యాధికారులు పాల్గొన్నారు.

చెన్‌గోముల్ పీహెచ్‌సీ తనిఖీ

పూడూరు: మండల పరిధిలోని చెన్‌గోముల్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డీహెచ్‌ఎంవో స్వర్ణకుమారి గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో పలు రికార్డులను పరిశీలించి వైద్యులు, సిబ్బందితో మాట్లాడారు. అనంతరం ఆసుపత్రికి వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్యులు సమయపాలన పాటించాలని, ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలని ఆదేశించారు. డీహెచ్‌ఎంవో వెంట వైద్యులు, సిబ్బంది ఉన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు సరిత

మేడ్చల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : చిన్నారులు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ సభ్యురాలు సరిత సూచించారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లో అంతర్జాతీయ బాలల హక్కుల వారోత్సవాలను నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సరిత మాట్లాడుతూ చిన్నారులు విద్య, రక్షణ, గౌరవం పొందడం, ప్రాథమిక హక్కన్నారు. అదనపు కలెక్టర్ రాధికాగుప్తా మాట్లాడుతూ ప్రతీ చిన్నారి ఆత్మవిశ్వాసం ఆనందంతో ఎదగాలన్నారు. ఈ సందర్భంగా బాలల హక్కులు రక్షిద్దామని కోరారు. సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ రాజారెడ్డి మాట్లాడుతూ పిల్లలు విద్యను పొందే హక్కు కలిగి ఉన్నారన్నారు. జిల్లా సంక్షేమ అధికారి శారద మాట్లాడుతూ బాలల హక్కులకు ఆటంకం కలిగితే 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు. బాలలు మంచి పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యవంతంగా ఉండాలని, విద్యతోనే ఏదైనా సాధించగలమన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పేదలకు అండగా ఉండాలి

మొయినాబాద్ రూరల్, నవంబరు20(ఆంధ్రజ్యోతి): ఆర్థిక పరిస్థితుల కారణంగా అనేక మంది పేదలు ఉన్నత వైద్యానికి నోచుకోవడం లేదని, అలాంటి వారికి అండగా ఉండాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ అన్నారు. గురువారం ఆలయం వద్ద ఉండే ఓ పేద కుటుంబానికి చెందిన దివ్యాంగురాలైన యువతికి చూడు చక్రాల కుర్చీ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. చిలుకూరు బాలాజీ ఆలయం ఆధ్వర్యంలో పేదలకు ఉచితంగా వైద్య సాయం చేస్తున్నట్లు తెలిపారు. ఉచితంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట పవన్‌కుమార్, ఆలయ సిబ్బంది ఉన్నారు.

మరకత శివలింగాన్ని దర్శించుకున్న రామజోగయ్య శాస్త్రి



శాస్త్రి దంపతులకు స్వామి వారి చిత్రపటాన్ని అందిస్తున్న కమిటీ సభ్యులు

శంకర్‌పల్లి, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చందిప్ప గ్రామంలోని మరకత శివలింగాన్ని గురువారం సినీ గేయ రచయిత రామజోగయ్య శాస్త్రి దంపతులు దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11వ శతాబ్దానికి చెందిన మహిమగల బ్రహ్మసూత్ర మరకత శివాలయాన్ని దర్శించుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి, ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్‌స్వామి, వైస్ చైర్మన్ శేఖర్ వారికి స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

ఉప్పర్‌పల్లి అంగన్‌వాడీ పనితీరు భేష్



మహిళలతో మాట్లాడుతున్న అధికారులు

శామీర్‌పేట, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ఉప్పర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రం పనితీరు భేష్ అని కేంద్ర ప్రభుత్వ డబ్ల్యూడీ, సీడబ్ల్యూ డైరెక్టర్ దయాశంకర్, మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి జానకీ విశ్వనాథన్ కితాబిచ్చారు. గురువారం తూంకుంట మున్సిపల్ పరిధిలోని ఉప్పర్‌పల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో ఆట, పాటలతో సందడి చేస్తున్న చిన్నారులను చూసి హర్షం వ్యక్తం చేశారు. ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్(ఈసీఈ) అమలు తీరుపై పిల్లల తల్లులను అడిగి తెలుసుకున్నారు. పౌష్టికాహారం పంపిణీ, లబ్ధిదారుల రికార్డులను పరిశీలించారు. అనంతరం అదనపు కలెక్టర్ రాధికాగుప్తా, జిల్లా సంక్షేమాధికారి శారద రాష్ట్ర ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాలకు, తల్లులకు, గర్భిణులకు అందజేస్తున్న పౌష్టికాహారం గురించి వివరించారు. కార్యక్రమంలో పార్లమెంటరీ కమిటీ సభ్యులు, కేంద్ర ప్రభుత్వ అధికారులు, అంగన్‌వాడీ టీచర్ శ్రీలత, సూపర్‌వైజర్ నాగమణి ఉన్నారు.

బీజాపూర్ హైవేపై తప్పిన పెను ప్రమాదం

అదుపుతప్పి చెట్టును ఢీకొట్టిన టిప్పర్

ప్రాణాలతో బయటపడ్డ డ్రైవర్

మీర్జాగూడ ఘటనకు 500 మీటర్ల దూరంలో ప్రమాదం



డ్రైవర్ శ్రీరామ్



చేవెళ్ల మండలం ఖానాపూర్ గేట్ వద్ద చెట్టును ఢీకొన్న లారీ

చేవెళ్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ - బీజాపూర్ హైవేపై ఘోర ప్రమాదం తప్పింది. అతివేగంగా వస్తున్న టిప్పర్ అదుపుతప్పి రోడ్డు పక్కన చెట్టును బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటన గురువారం ఉదయం చేవెళ్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. బీజాపూర్ హైవే విస్తరణ పనుల్లో భాగంగా చేవెళ్ల మండలంలోని అంతారం గ్రామం నుంచి టిప్పర్‌లో మట్టిని నింపుకొని డ్రైవర్ వడ్డె శ్రీరామ్(28) వస్తున్నాడు. ఖానాపూర్ స్టేజి వద్దకు రాగానే అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు ఢీకొట్టాడు. ఈ ఘటనలో టిప్పర్ ముందు భాగం నుజ్జునుజ్జు కాగా డ్రైవర్ శ్రీరామ్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని టిప్పర్‌ను అక్కడి నుంచి తరలించారు. అయితే ఇటీవల ఇదే రోడ్డుపై మీర్జాగూడ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగి 19 మంది మృతి చెందగా.. మరో 34 మంది గాయాలపాలైన ఘటనా స్థలానికి అర కిలోమీటర్ దూరంలోనే ఈ ఘటన చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

ముమ్మరంగా రోడ్డు విస్తరణ పనులు

బీజాపూర్ హైవేలో అప్పా జంక్షన్ నుంచి మన్నెగూడ వరకు 46 కిలో మీటర్ల వరకు రోడ్డు విస్తరణ పనులు చురుకుగా సాగుతున్నాయి. మీర్జాగూడ ప్రమాదం తర్వాత రోడ్డు విస్తరణ పనులు మేఘా కృష్ణారెడ్డి(కాంట్రాక్టర్) పనులను వేగవంతం చేశారు. జేసీబీలు, పెద్ద పెద్ద యంత్రాలతో రోడ్డుకిరువైపులా చదును చేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. దాదాపుగా 20 వాహనాలతో పనులు జరుగుతున్నాయి.

తొమ్మిది నెలల్లో పనులు పూర్తి

» ప్రెస్‌మీట్‌లో చేవెళ్ల, తాండూరు, పరిగి ఎమ్మెల్యేలు

బీజాపూర్ జాతీయ రహదారి విస్తరణ పనులను వేగవంతం చేసి తొమ్మిది నెలల్లో పూర్తి చేస్తామని చేవెళ్ల, తాండూరు, పరిగి ఎమ్మెల్యేలు యాదయ్య, మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి అన్నారు. గురువారం చేవెళ్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఈ హైవే పనులు గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ముందుకు సాగలేదన్నారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి రోడ్డు విస్తరణ పనులపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారని చెప్పారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌లో కేసు వేసిన ఎన్జీవోలతో మాట్లాడి కేసును విరమింపజేశామన్నారు. దీంతో అక్టోబరు 31న ట్రిబ్యునల్ రోడ్డు పనులు చేపట్టాలని తీర్పు ఇచ్చిందని తెలిపారు. ఈ రోడ్డు విస్తరణకు నోచుకోకపోవడంతో ఎంతో మంది ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రోడ్డు విస్తరణలో భాగంగా చిలుకూరు జంక్షన్, భాస్కర్ మెడికల్ కాలేజీ వద్ద, సురంగల్ రోడ్డు, మొయినాబాద్, కనకమామిడి, కేతిరెడ్డిపల్లి, తోల్కట్ట, ముడిమ్యాల్, పలుగుట్ట, చేవెళ్ల, మీర్జాగూడ, దామరిగిద్ద, చిట్టంపల్లి, మీర్జాపూర్ తదితర చోట్ల అండర్‌పాస్‌లు వస్తాయన్నారు. 60 మీటర్ల వెడల్పుతో 24 గంటల పాటు పనులు కొనసాగుతున్నాయన్నారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాల భవనానికి త్వరలోనే తోల్కట్ట గ్రామంలో భూమి పూజ చేస్తామని, ఆర్టీసీ బస్ డిపో నిర్మాణ పనులు సైతం ప్రారంభిస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర పొల్యూషన్ బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, నాయకులు జనార్దన్‌రెడ్డి, మైపాల్‌రెడ్డి, కృష్ణారెడ్డి, పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు యాదయ్య, మనోహర్‌రెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, కొడంగల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి

ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అక్రమాలు వాస్తవమే

» జిల్లా హౌసింగ్ డీఈ సురేశ్

» ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కొందుర్గు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో అక్రమాలు జరిగిన విషయం వాస్తవమేనని జిల్లా హౌసింగ్ డీఈ సురేశ్ వెల్లడించారు. ఈ మేరకు గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'ఇందిరమ్మ.. ఇదేందమ్మ!' కథనానికి ఆయన స్పందించారు. కొందుర్గు మండలాన్ని సందర్శించి సంబంధిత అధికారులు, గ్రామ కార్యదర్శులను విచారించి... అక్రమంగా నిర్మించిన ఇండ్లను పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మి అనురాధతో కలిసి అక్రమ నిర్మాణాల గురించి ఆరా తీశారు. ఇందులో చెరుకుపల్లి గ్రామానికి సంబంధించి మల్లని పావని పేరుతో మంజూరైన ఇంటిని పవన్‌కుమార్ పేరిట ఎందుకు మార్చాల్సివచ్చిందంటూ ఎంపీడీవో కార్యాలయ సిబ్బందితో పాటు, గ్రామ కార్యదర్శి అశోక్‌ను నిలదీశారు. దీనికి ఎంపీడీవో స్పందించి ఇందిరమ్మ ఇంటి ఆన్‌లైన్‌లో ఎందుకు ఎడిట్ చేశావని, అందరి ముందు సమాధానం చెప్పాలంటూ చెరుకుపల్లి గ్రామ కార్యదర్శి అశోక్‌పై మండిపడ్డారు. దీనికి అశోక్ స్పందిస్తూ ఇందిరమ్మ కమిటీ సూచనల మేరకు రెండు పేర్లు ఒకేరకంగా ఉండటంతో ఒక్క పేరును ఎడిట్ చేశానని కార్యదర్శి తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. అక్రమ నిర్మాణానికి సంబంధించి బ్యాంకు ఖాతాలో జమ చేసిన రూ.లక్షను స్వాధీనం చేసుకోవడంతో పాటు, ప్రస్తుతం నిర్మిస్తున్న ఇంటికి డబ్బులు మంజూరు చేయబోమని తెలిపారు. ఈ అక్రమాలకు సంబంధించిన నివేదికను ఉన్నత స్థాయి అధికారులకు అందజేస్తామన్నారు.

మక్కల కొనుగోలుకు ఓకే..

» ఆన్‌లైన్‌లో నమోదుకు రైతులకు వెసులుబాటు



తాండూరులో కొనుగోలు చేసిన మక్కలను గోదాంకు లారీలో తరలిస్తున్న దృశ్యం

తాండూరు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి మక్కల కొనుగోలుకు వ్యవసాయ శాఖ ఆన్‌లైన్‌లో వెసులుబాటు కల్పించింది. 'మక్కలకు ఆన్‌లైన్ తిప్పలు' శీర్షికతో ఈ నెల 11న ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. వ్యవసాయాధికారులు ఫీల్డ్‌లోకి వెళ్లి మక్కల రైతులను గుర్తించకుండా కార్యాలయం వద్ద కూర్చొని పేర్లు ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో అసలైన రైతుల పేర్లు లేక మక్కల కొనుగోలుకు అవకాశం లేకుండా పోయింది. కొంత మంది రైతుల పేర్లు నమోదైనా ఆన్‌లైన్‌లో అప్‌డేట్ కాకపోవడంతో మక్కలు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ రంగ సంస్థలు నిరాకరించాయి. ఆన్‌లైన్‌లో నమోదైన రైతుల నుంచి మాత్రమే మక్కలు కొనుగోలు చేయాలని ప్రభుత్వం నిబంధనలు విధించడంతో రైతులు నిరాశ చెందారు. ఈ మేరకు ప్రభుత్వం స్పందించి ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు కాని రైతులు రెండు రోజులపాటు పేర్లు నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఎకరాకు 25 క్వింటాళ్లు మించకుండా మక్కలను రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. తాండూరులో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో ఆన్‌లైన్‌లో నమోదైన 28 మంది రైతుల నుంచి 1,400 క్వింటాళ్ల మక్కలను కొనుగోలు చేశారు. వాటిని మార్క్‌ఫెడ్ లీజ్‌కు తీసుకున్న గోదాంకు తరలించారు.

విద్యుత్ అంతరాయం.. నిలిచిన డయాలసిస్ సేవలు

వికారాబాద్ ఆస్పత్రిలో ఇబ్బందులు పడ్డ రోగులు

వికారాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని డయాలసిస్ కేంద్రంలో విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో డయాలసిస్ సేవలు నిలిచిపోయాయి. గత ప్రభుత్వంలో వికారాబాద్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రంలో గతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోతే జనరేటర్ లేక అవస్థలు పడగా పత్రికల్లో వచ్చిన కథనాలకు అధికారులు స్పందించి జనరేటర్ ఏర్పాటు చేయడంతో డయాలసిస్ సేవలు కొంత కాలంగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనసాగాయి. అయితే గురువారం ఉదయం త్రీఫేజ్ విద్యుత్ సరఫరాలో లోడ్ కారణంగా డయాలసిస్ కేంద్రంలోని విద్యుత్ బోర్డుల్లో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో ఉదయం 5 గంటల నుంచి ఏం తినకుండా వచ్చిన రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సుమారు 4 గంటలు పాటు చికిత్స అందుకోక ఏం తినక అవస్థలు పడ్డారు. విద్యుత్ సమస్య పరిష్కారమైన తరువాత రోగులకు సేవలు అందించారు.

వెల్లివిరిసిన మత సామరస్యం



అయ్యప్ప స్వాములకు అన్నదానం చేస్తున్న మహ్మద్ అలీ

మొయినాబాద్ రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కులమతాలకు అతీతంగా ఓ వ్యక్తి అయ్యప్ప స్వాములకు అన్నప్రసాద వితరణ చేసి మతసామరస్యాన్ని చాటుకున్నాడు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్‌నగర్ వార్డులో గ్రామానికి చెందిన దాదాపు 50 మందికి పైగా అయ్యప్ప మాలధరణ చేశారు. వీరికి అదే గ్రామానికి చెందిన మహ్మద్ అలీ గురువారం ఉదయం అన్నప్రసాద వితరణ చేసి తనలో ఉన్న భక్తిని చాటుకున్నాడు. స్వయంగా ఆయనే వడ్డించి స్వాముల పక్కన కూర్చొని భోజనం చేశారు. ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా స్వాములను అన్నప్రసాద వితరణ చేసి మతసామరస్యాన్ని చాటుకున్నాడు. సన్నిదానం గురు స్వామి మురళి, గురు స్వాములు మహేందర్ యాదవ్, రాఘవేందర్, శ్రీశైలం, కుమార్, వెంకటేష్‌గౌడ్, సదానందం గౌడ్, శాంతియువజన సంఘం అధ్యక్షుడు కుమ్మరి విఠల్, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కట్టమిత్తి శ్రీను పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా మోహన్ రెడ్డి



మేడ్చల్ టౌన్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): మేడ్చల్ - మల్కాజ్గిరి జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శిగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీకి చెందిన అమరం మోహన్ రెడ్డిని నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం పార్టీ అధిష్ఠానం ఆయనకు నియామక పత్రాన్ని అందజేసింది. ప్రస్తుతం నియోజకవర్గ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న ఆయనకు జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించడంపై నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్ఠానానికి మోహన్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

మేడ్చల్ రూరల్ జిల్లా కార్యదర్శిగా హనుమాన్



ఘట్‌కేసర్: మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లా బీజేపీ రూరల్ జిల్లా కార్యాదర్శిగా విప్పర్ల హనుమాన్ నియమితులయ్యారు. పార్టీలో వివిధ స్థాయిల్లో క్రియాశీలకంగా పనిచేస్తూ పార్టీ అభివృద్ధికి చేస్తున్న కృషికి గాను హనుమాన్‌కు జిల్లా కమిటీలో స్థానం కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఇచ్చిన బాధ్యతలను శక్తి వంచన శ్రమిస్తానన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బుద్ది శ్రీనివాస్, రాష్ట్ర నాయకుడు పట్లోళ్ల విక్రంరెడ్డి, రాష్ట్ర నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

పరారీలో జువెల్లరీ యజమాని.. ఆందోళనలో బాధితులు

కులకచర్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఐదు రోజులుగా కులకచర్లలోని అజయ్ జువెల్లర్స్ షాపు యజమాని నరేందర్ చౌదరి ఆచూకీ లభించకపోవడంతో అటు రాజస్థాన్‌లో ఉన్న కుటుంబ సభ్యులు, ఇటు కులకచర్లలో బాధితులు ఆందోళన చెందుతున్నారు. ఈ నెల 16న ఉదయం షాపు తెరిచి వస్తువులు బ్యాగులో పెట్టాడని ఇంటి యజమాని రాజేశ్ తెలిపాడు. తాను తిరుపతికి వెళ్తున్నానని, రెండు రోజుల్లో వస్తానని చెప్పాడని పేర్కొన్నాడు. కస్టమర్స్ వచ్చి నరేందర్ చౌదరి పారిపోయాడని చెప్పడంతో తాను కూడా రూ.3 లక్షలు ఇచ్చానని వాపోయాడు. అదే రోజు బంధువుల ఫంక్షన్‌కు వెళ్తున్నాను, తిరిగి వచ్చిన తర్వాత ఇస్తానని చెప్పి 30 గ్రాముల బంగారు గొలుసు తీసుకెళ్లినట్లు బాల్‌రెడ్డి వాపోయాడు. ఇప్పటివరకు 24 మంది బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించినట్లు ఎస్సై రమేశ్‌కుమార్ గురువారం ప్రకటనలో తెలిపారు. బాధితులకు నరేందర్ చౌదరి నుంచి రూ.37 లక్షల నగదు, 36.8 తులాల బంగారం, 40 తులాల వెండి రావాల్సి ఉందని వివరించారు. అతని ఆచూకీ కోసం ప్రత్యేక టీంను ఏర్పాటు చేశామని, బాధితులు పీఎస్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్సై సూచించారు.

కక్ష సాధింపుతోనే ఈ-రేస్ కేసు

మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్

వికారాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): రాజకీయ కక్ష సాధింపు చర్యలో భాగమే ఫార్ములా ఈ - రేస్ కేసు అని మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ పేర్కొన్నారు. ఉన్నట్టుండి ఈ కేసును తెరపైకి తేవడం ద్వారా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఇబ్బంది పెట్టి రాక్షసానందం పొందడానికి రేవంత్‌రెడ్డి సర్కార్ సిద్ధమమైందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రాజకీయంగా లబ్ధిపొందాలని రేవంత్ రెడ్డి ఇలాంటి డ్రామాలకు తెరలేపారని మండి పడ్డారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురి చేయడమే రేవంత్‌రెడ్డి లక్ష్యమన్నారు. పూర్తి పారదర్శకతతో నిర్వహించిన ఫార్ములా ఈ రేస్ కేసు ఇన్నాళ్లు నిద్రావస్థలో ఎందుకు ఉండిపోయిందన్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టి ఎలాగైనా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల ధైర్యాన్ని దెబ్బతీయాలని రేవంత్ సర్కార్ చూస్తుందన్నారు.

'ప్రజా బాట'తో మెరుగైన సేవలు

ఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి



రక్షణ చర్యలను పరిశీలిస్తున్న అధికారులు

వికారాబాద్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): విద్యుత్ వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ప్రజా బాట కార్యక్రమం చేపట్టామని ఎస్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ బాలస్వామి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని బసంత్ ఫంక్షన్ హాలులో ఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రజాబాట కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. వచ్చే వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. దీని కోసం రూ.55 కోట్ల బడ్జెట్ కేటాయించామని తెలిపారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లు పెండింగ్‌లో లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ప్రజా బాటలో భాగంగా వారంలో మూడు రోజులు క్షేత్రస్థాయిలో పర్యటించి విద్యుత్ సమస్యలను గుర్తించి పరిష్కరించాలన్నారు. అంతకుముందు వికారాబాద్ పట్టణంలో అధికారులతో కలిసి వివిధ కాలనీల్లో పర్యటించారు. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు, లైన్స్ నిర్వహణ తీరును పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ రవిప్రసాద్, డీఈ టెక్నికల్, డీఈలు సంజీవరావు, భానుప్రసాద్, ఎస్ఏవో శ్రీనివాసనాయక్, ఏవో శ్రీనాథ్, జిల్లా ఏడీఈలు, ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

12 శాతం రిజర్వేషన్లు కల్పించే వరకూ పోరాడుతాం

కడ్తాల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించి అమలు చేసే వరకూ పోరాడుతామని గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనుల రిజర్వేషన్లు వెంటనే అమలు చేసి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలన్నారు. 12 శాతం రిజర్వేషన్ల కల్పన కోసం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద 'మారో నగరా - జాగో బంజారా' కార్యక్రమానికి కడ్తాల మండలం నుంచి హన్మనాయక్ ఆధ్వర్యంలో గిరిజన నాయకులు పెద్ద సంఖ్యలో తరలి వెళ్లారు. మాజీ మంత్రి రవీంద్రనాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వివిధ రాష్ట్రాల గిరిజనులు పాల్గొన్నట్లు పేర్కొన్నారు. రిజర్వేషన్లు, హక్కుల సాధనకు గిరిజనులంతా సంఘటితంగా పోరాడాలని హన్మనాయక్ పిలుపునిచ్చారు. దేశంలోని లంబాడా, బంజారాలను 16 రకాల పేర్లతో పిలువకుండా అందరికీ షెడ్యూల్ తెగల్లో ఎస్టీ బంజారాగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీలకు చెందిన గిరిజన సంఘాల నేతలు బీక్యానాయక్, జగన్‌నాయక్, శంకర్‌నాయక్, లక్పతి నాయక్, నరేశ్ నాయక్, సేవ్యానాయక్, హరిచంద్ నాయక్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర గిరిజన సేవా సంఘం అధ్యక్షుడు హన్మనాయక్

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు



పోలెపల్లిలో విద్యుత్ ఫీడర్‌ను ప్రారంభిస్తున్న పాండ్యానాయక్

ఆమనగల్లు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యుత్ లోవోల్టేజీ సమస్యలను పరిష్కరించి రైతులు, వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు రంగారెడ్డి జోన్ విద్యుత్ శాఖ ఎస్ఈ పాండ్యానాయక్ తెలిపారు. ఆమనగల్లు మండలంలోని పోలెపల్లి 33/11 కేవీ విద్యుత్ కేంద్రంలో పోలెపల్లికి చెందిన 24 గంటల విద్యుత్ సరఫరా కోసం నూతనంగా ఏర్పాటు చేసిన 11 కేవీ ఫీడర్‌ను గురువారం రాజేంద్రనగర్ ఎస్ఈ మోహన్, కందుకూరు గోపాలకృష్ణ, డీఈ బాలకృష్ణతో కలిసి ఎస్ఈ పాండ్యానాయక్ ప్రారంభించారు. అనంతరం గ్రామస్థులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏఈ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన

ఆమనగల్లు/కొత్తూర్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల సమరానికి అధికారులు సన్నద్ధమయ్యారు. ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి, కొత్తూర్ మండలాల్లో గురువారం సర్పంచ్ ఎన్నికల ఓటర్ల జాబితాలను ఎంపీడీవోలు మాధురి, సుజాత, శ్రీకాంత్, విజయలక్ష్మి, డాక్టర్ అరుంధతిలు ప్రదర్శించారు. మండల పరిషత్ కార్యాలయాలతో పాటు ఆయా మండలాల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో జాబితాలను ప్రదర్శించారు. ఏమైన అభ్యంతరాలు ఉన్నా.. పేర్లు ఓటర్ లిస్టులలో లేకపోయినా కార్యదర్శులకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవోలు సూచించారు.

- నష్టపోతున్న గ్రామీణ స్టూడెంట్స్
- మూడు నెలలుగా ఫిజిక్స్ టీచర్ లేని ముద్విన్ పాఠశాల
- ఇద్దరు టీచర్లకు ఒకరు పదోన్నతిపై బదిలీ, మరొకరికి డిప్యూటేషన్
- విద్యార్థుల ఆందోళన.. పట్టని అధికారులు

ఇష్టారాజ్యంగా డిప్యూటేషన్లు.. విద్యార్థుల అగచాట్లు



స్కూల్ గేటు ఎదుట విద్యార్థుల ఆందోళన(ఫైల్)

కడ్తాల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యాశాఖ అధికారులు ఇష్టారాజ్యంగా ఇస్తున్న ఉపాధ్యాయుల డిప్యూటేషన్ల మూలంగా గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారు. కడ్తాల మండలం ముద్విన్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు నెలలుగా ఫిజిక్స్ టీచర్ లేక నష్టపోతున్నామంటూ విద్యార్థులు ఆందోళన బాట పట్టారు. డిప్యూటేషను రద్దు చేయాలని విద్యార్థులు రోడ్డెక్కి ధర్నా నిర్వహించారు. అయినప్పటికీ విద్యాశాఖ అధికారులు స్పందించకపోవడంతో పాఠశాలకు తాళం వేసి ప్రధాన ద్వారం వద్ద నిరసన తెలిపారు. రెండు రోజులుగా విద్యార్థులు ఉపాధ్యాయురాలి కోసం నిరసన కార్యక్రమాలు సాగిస్తున్నా పాలక ప్రజాప్రతినిధుల్లో సైతం స్పందన లేదు. దాంతో ముద్విన్ ఉన్నత పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, వారికి మద్దతుగా వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఆందోళన కార్యక్రమాలకు సిద్ధమవుతున్నారు. పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి వరకు 142 మంది విద్యార్థులున్నారు. అయితే, ఫిజిక్స్ బోధించే టీచర్లు మాత్రం లేరు. గతంలో ఇద్దరు ఫిజిక్స్ టీచర్స్ ఇక్కడ పనిచేసేవారు. రమాదేవి టీచర్ జీహెచ్ఎంగా పదోన్నతిపై నాగర్‌కర్నూల్ జిల్లాకు బదిలీ అయ్యారు. మరో టీచర్ ప్రవీణకు ఆగస్టు 22న మన్సురాబాద్ ఉన్నత పాఠశాలకు జిల్లా విద్యాశాఖ అధికారులు డిప్యూటేషన్ ఇచ్చారు. మూడు నెలలుగా ఫిజిక్స్ టీచర్ లేరు. పలుమార్లు ప్రవీణ డిప్యూటేషన్‌ను రద్దుచేసి పాఠశాలకు పంపాలని హెచ్ఎం నిర్మల, స్థానిక నాయకులు విద్యాశాఖ అధికారులను కోరారు. దాంతో సెప్టెంబరు 17న ప్రవీణ డిప్యూటేషన్‌ను రద్దు చేస్తూ తిరిగి పూర్వ పాఠశాల ముద్విన్‌కు వెళ్లాలని డీఈవో ఆదేశాలు జారీ చేశారు. అదేరోజు ఆమెను రిలీవ్ చేశారు. అదే నెల 18న తిరిగి తనకు డిప్యూటేషన్ ఇచ్చారని ఉపాధ్యాయురాలు పాఠశాలకు రావడం లేదు. ఆమె డిప్యూటేషన్ రద్దు చేయాలని హెచ్ఎం డీఈవోకు, ఉన్నతాధికారులకు లేఖ పంపారు. అయినా ఇప్పటికీ స్పందన లేదు.

ఉన్నతాధికారులకు నివేదించాం



ఫిజిక్స్ టీచర్ లేక విద్యార్థులు ఆందోళన చేస్తున్న విషయాన్ని ఉన్నతాధికారులకు నివేదించాం. డిప్యూటేషన్ రద్దు చేసిన ప్రవీణను పాఠశాలకు రావాలని తెలిపినా స్పందించడం లేదు. వేతనాన్ని కూడ నిలిపివేశారు. మరోమారు డీఈవోకు నివేదిస్తాం.

- నిర్మల, హెచ్ఎం, ముద్విన్ స్కూల్

రాజశేఖర్ కుటుంబాన్ని ఆదుకుంటాం



వాణికి చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే శంకర్

షాద్‌నగర్ రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): కిడ్నాప్, హత్యకు గురైన రాజశేఖర్ కుటుంబాన్ని ప్రభుత్వపరంగా ఆదుకుంటామని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ తెలిపారు. ఫరూఖ్‌నగర్ మండలం ఎల్లంపల్లికి గురువారం ఆయన వెళ్లారు. మృతుడి కుటుంబానికి రూ.50 వేల చెక్కును అందించారు. ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేశామని, అదనంగా మరో ఇల్లు మంజూరు చేస్తున్నట్లు వివరించారు. ప్రేమ వివాహాలు నేటి సమాజంలో నేరం కాదని, తమ్ముడి ప్రేమకు అన్నను దారుణంగా చంపడం హేయమన్నారు. మృతుడి భార్య వాణి, తండ్రి మల్లేశ్, కుటుంబసభ్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అందాల్సిన సంక్షేమ పథకాలపై ఆర్డీవోకు ఫోన్ ద్వారా వివరించారు. తన ఇంట్లో కూడా ప్రేమ వివాహాలు చేసుకున్నారని, అన్యోన్యంగా ఉన్నారని ఎమ్మెల్యే తెలిపారు. ఏఎంసీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, తిరుపతిరెడ్డి, సిద్ధార్థ, సురేందర్, జగన్, కృష్ణారెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్ తదితరులున్నారు.

బుగ్గ క్షేత్రం.. భక్త జనసంద్రం

- చివరిరోజు వేలాదిగా తరలివచ్చిన ప్రజలు
- కార్తీకమాస స్నానాలు.. ప్రత్యేక పూజలు



కార్తీకస్నానాల వద్ద భక్తుల కోలాహలం

మంచాల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా పేరొందిన బుగ్గ క్షేత్రం శివనామస్మరణతో మార్మోగింది. కార్తీక మాసం అమావాస్య చివరిరోజు కావడంతో భక్తుల రద్దీ నెలకొంది. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులతో జాతర జనసంద్రమైంది. గురువారం 70వేలకు పైగా భక్తులు బుగ్గరామలింగేశ్వరుడిని దర్శించుకున్నారు. కుటుంబసమేతంగా పవిత్రజలాల్లో కార్తీకస్నానాలు ఆచరించారు. వందమంది సిబ్బందితో బందోబస్తు నిర్వహించినట్లు సీఐ మధు తెలిపారు. అన్నిశాఖల అధికారులు, ఉత్సవ కమిటీ, స్థానిక నాయకుల సహకారంతో 15 రోజులపాటు జాతర ఆటంకాలు లేకుండా ముగించినట్లు ఎంపీడీవో బాలశంకర్ తెలిపారు.

కందుకూరు : కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మండలంలోని కొత్తగూడ, కందుకూరు, జైత్వారం తదితర గ్రామాల్లో భజన కీర్తనలు ఘనంగా కొనసాగుతున్నాయి. వివిధ గ్రామాలకు చెందిన భక్తులు రాత్రి వేళ ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. భజన భక్తమండలి వారిచే ప్రత్యేకంగా భజన కీర్తనలు ఆలపిస్తున్నారు.

విద్యా వ్యవస్థలో సమూల మార్పులు



బాలోత్సవంలో మాట్లాడుతున్న ఎంపీ డాక్టర్ మల్లు రవి

ఆమనగల్లు, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సహించడానికి బాలోత్సవం కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు డాక్టర్ మల్లు రవి, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, విద్యాకమిషన్ సభ్యుడు డాక్టర్ చారగొండ వెంకటేశ్‌లు అన్నారు. గురువారం పట్టణ సమీపంలోని ఓ కన్వెన్షన్‌లో బాలోత్సవం నిర్వహించగా వారు ప్రారంభించారు. రెండురోజుల కార్యక్రమానికి నిర్వాహకులు పెద్దఎత్తున ఏర్పాట్లు చేశారు. విద్యార్థినీ విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. విద్యా వ్యవస్థలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టి కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతున్నట్లు మల్లు రవి, నారాయణ రెడ్డిలు చెప్పారు. తలకొండపల్లి మండలం ఖానాపూర్‌లో రూ.200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ పాఠశాల ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మాజీ జడ్పీ వైస్‌చైర్మన్ బాలాజీసింగ్, పీసీసీ కార్యదర్శి మధుసూధన్ రెడ్డి, నాయకులు భృంగి ఆనంద్‌కుమార్, పర్వత్‌రెడ్డి, మోతీలాల్, విజయ్‌కుమార్‌రెడ్డి, భూపతిరెడ్డి, సంజీవ్‌కుమార్, విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

నిరుపేదలకు చేయూతనివ్వాలి

యాచారం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు సాయమందించి ఆదుకునేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు ముందుకురావాలని జాతీయ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత లిక్కి అనిరుద్రారెడ్డి అన్నారు. చింతపట్లలో ఇటీవల మరణించిన అంజయ్యగౌడ్ సతీమణి శోభకు గురువారం రూ.5వేలు, గ్రామపెద్దలు రూ.30వేల ఆర్థికసాయం అందించారు. ఆపదలో ఉన్న వారికి చేయూతనిద్దామని ఆయన పిలుపునిచ్చారు, ఆమె పిల్లలను చదివించడానికి సహకారమందిస్తామన్నారు.

పడిపోయిన 'పప్పు'

(ఐదో పేజీ తరువాయి)

సాగువైపే వారు ఆసక్తి చూపుతున్నారు. ఇబ్రహీంపట్నం, చేవెళ్ల, కొడంగల్, మహేశ్వరం నియోజకవర్గాలలో పప్పు దినుసులను తక్కువగా సాగు చేస్తున్నారు. ఇంటి అవసరాలకు మాత్రమే బొబ్బెర, పొద్దుతిరుగుడు, ఉలవ, కంది, పెసర, శనగ, వేరుశనగ సాగు చేసుకుంటున్నారు. కొంత మంది రైతులు మాత్రమే నాలుగైదు క్వింటాళ్ల మేర వేరుశనగ, శనగ సాగు చేస్తున్నారు. ఒకప్పుడు ఒక్క గ్రామంలో కనీసం వంద టన్నుల వరకు శనగలు, వేరుశనగలు పండించేవారు. రానురాను సాగును తగ్గించుకుంటున్నారు. పప్పుల సాగు లాభదాయకంగా ఉన్నా రైతులు అధికంగా పత్తిపైనే దృష్టి సారిస్తున్నారు. పప్పు దినుసుల సాగుకు శ్రమ, ఖర్చు అధికం కావడంతో వాటిని పండించేందుకు అనాసక్తి చూపుతున్నారు. అపరాల సాగుతో ఎకరాకు 40 వేల ఆదాయం పొందవచ్చు. పప్పు దినుసుల సాగుపై అవగాహన, మెలకువల గురించి వివరించడంలో వ్యవసాయాధికారులు అవగాహన కల్పించడంలో విఫలమయ్యారనే విమర్శలు ఉన్నాయి.

వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా..

జిల్లాలో పప్పుల సాగుకు అనుకూలంగా ఉంటుంది. ఎకరం వరి సాగుకు రూ.15వేలు, ఎకరం పత్తికి రూ.35 వేల వరకు వ్యయమవుతుంది. కానీ అదే పప్పుల సాగుకు ఎకరాకు రూ.8వేలు మించదని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. పప్పు దినుసులు తక్కువ కాలంలో పంట చేతికందుతుంది. వీటి సాగులో సూచనలు, సలహాలు ఇచ్చే వారు లేకపోవడంతో రైతులు పత్తివైపు మొగ్గు చూపుతున్నారు. ఇదిలా ఉండగా జిల్లాలోని ప్రతీ గ్రామంలో కనీసం నాలుగైదు ఎకరాలలో ఉలవ సాగు చేస్తుంటారు. జిల్లాలో పప్పు దినుసులైన శనగ, వేరుశనగ, కంది, మినుము, ఉలవ, పంటలకు అనుకూలంగా ఉంటుంది. రైతులకు పప్పు దినుసుల విత్తనాలు 75 శాతం రాయితీపై అందిస్తే.. ఒక్కో మండలంలో దాదాపుగా ఏటా 3 వేల హెక్టార్లలో సాగు చేసే వీలుంది. కానీ రైతులకు అవగాహన లేకపోగా మేలురకం విత్తనాలు, మార్కెట్ వసతి లేకపోవడంతో పాటు చీడపీడల బెడద అధికంగా ఉంటుందని రైతులు భయపడి పప్పుల సాగు చేయడం లేదు.

యాసంగిలో సాగు(ఎకరాల్లో)

పంట	లక్ష్యం	ఇప్పటివరకు
వేరుశనగ	7,055	55
పెసలు	25	00
మినుములు	41	00
పొద్దుతిరుగుడు	1660	01
శనగలు	665	00

భూమాతకూ లాభమే..

పప్పు దినుసుల సాగుతో గాలిలోని నత్రజని, తేమ తక్కువ పీల్చుకొని భూమికి మేలు చేస్తుంది. పంట కోత తరువాత దుమ్ము చేస్తే మంచి ఎరువును అందించినట్లవుతుంది. రసాయన ఎరువుల వాడకం, పంట పెట్టుబడి కూడా తగ్గుతుంది. నేడు పప్పులను వ్యాపారులు ఇతర జిల్లాల నుంచి దిగుమతి చేసుకుంటున్నారు. పప్పుదినుసుల సాగు చేసే రైతులకు రాష్ట్ర ప్రభుత్వం తగు ప్రోత్సాహం ఇవ్వకపోవడంతో వీటిని సాగు చేయలేకపోతున్నారని రైతులు చెప్పారు. కాగ మినుము, కంది, శనగ, పెసర, వేరుశనగ విత్తనాలకు 50శాతం రాయితీ ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. నేడు వీటికి 30 శాతం రాయితీ ఇస్తున్నారని అధికారులు చెప్పారు. పప్పుదినుసుల ఉత్పత్తి పెంచడానికి 2004-05లో ఇసోఫామ్ పథకం రాష్ట్రంలో అమలు చేసినా దీనిపై రంగారెడ్డి జిల్లా రైతులకు వివరించే నాథుడే లేకపోవడంతో ప్రజాప్రతినిధులు కూడ పప్పు దినుసుల సాగుకు కావాల్సిన నిధులను రాష్ట్ర ప్రభుత్వం నుంచి రాబట్టలేకపోయారు.

కాగా, జిల్లాలో పెసర 452 హెక్టార్లు, మినుము 750 హెక్టార్లు, కంది 14.914 ఎకరాలు, వేరుశనగ 49 ఎకరాలు, పొద్దుతిరుగుడు 38.19 ఎకరాలు సాగు చేస్తున్నారు.

రూ.3 లక్షల ఎల్వోసీ అందజేత

ఆదిభట్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తికి మంజూరైన రూ.3 లక్షల సీఎంఆర్ఎఫ్ ఎల్వోసీని గురువారం కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మంఖాల శేఖర్‌రెడ్డి, మండల నాయకుడు పట్నం శివకుమార్ లబ్ధిదారుడి కుటుంబ సభ్యులకు అందజేశారు. కాగా, ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమినేడుకు చెందిన పిట్టల శేఖర్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈమేరకు అతడు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.

రాజ్యాధికారం కోసం బీసీలంతా ఏకం కావాలి

(ఐదో పేజీ తరువాయి)

పోరాడి సావిత్రిబాయి జన్మదినోత్సవాన్ని ప్రభుత్వం మహిళ ఉపాధ్యాయ దినోత్సవంగా అధికారికంగా నిర్వహించేలా చేశామన్నారు. దీక్షలో కూర్చున్న వారికి నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. తెలంగాణ జాగృతి బీసీ అధ్యక్షుడు మారయ్య, మైనార్టీ అధ్యక్షుడు ముస్తఫా, బీసీ రిజర్వేషన్ల సాధన సమితి నాయకులు రాజేందర్‌గౌడ్, రవీందర్, నర్సింహులు, రాము, రాజు, మల్లయ్య, రాహుల్, రమేష్, ఇబ్రహీం, ఇమ్రాన్, కూర వెంకటయ్య, లింగం, మాసయ్య, తదితరులు పాల్గొన్నారు.

జనం సమస్యలపైనే జనం బాట

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా జనం సమస్యలను తెలుసుకుని పోరాటం చేయడానికే జనం బాట కార్యక్రమాన్ని చేపట్టామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. జాగృతి జనంబాట కార్యక్రమంలో భాగంగా గురువారం సాయంత్రం షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారితో పాటు ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ విష్ణువర్ధన్, ఇతర సిబ్బందితో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో సిబ్బంది కొరత ఉందని, ప్రభుత్వం ఖాళీలను భర్తీ చేసి, వైద్య సేవలను విస్తరించాలని డిమాండ్ చేశారు. పెచ్చులూడుతున్న పాత భవనంలోనే వైద్య సేవలు పొందుతున్న రోగులు భయపడుతున్నారని అన్నారు. నిర్మాణంలో ఉన్న 100 పడకల ఆసుపత్రి పనులను త్వరితగతిన పూర్తి చేసి, ఆసుపత్రిని మార్చాలని కవిత డిమాండ్ చేశారు. షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గానికి సాగునీరు అందిస్తామన్న లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ హామీలకే పరిమితమైందని, దాని నిర్మాణం కోసం పోరాటం చేస్తానని తెలిపారు. తెలంగాణ జాగృతి నాయకులు పాండురంగారెడ్డి, ముస్తాఫా, రమేష్ కురుమ, స్వప్న, కవిత, అర్చనా సేనాపతి, కె. శ్రీనివాస్, నరేష్ నేత, శివారెడ్డి, రాములుయాదవ్, బాలాజీ ఉదయ్ తదితరులు ఉన్నారు.



కొత్తూర్ : జేపీ దర్గాలో కవితకు ముజావర్ల ఆశీర్వచనం

రీజినల్ రింగ్‌రోడ్డుకు రీసర్వే చేయాలి

కేశంపేట : రీజినల్ రింగ్‌రోడ్డుకు మళ్లీ సర్వే చేయాలని, ఇందులో పెద్దోళ్లను కాపాడేందుకు.. పేదోళ్లకు అన్యాయం చేస్తున్నారని, ఈ విషయమై కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలుద్దామని ట్రిపుల్‌ఆర్ భూ నిర్వాసితులకు కవిత భరోసా ఇచ్చారు. కేశంపేట మండలం తొమ్మిదిరేకుల, నిర్దవెల్లిలో భూములు కోల్పోతున్న రైతులతో గురువారం రాత్రి ఆమె సమావేశమయ్యారు. కేశంపేట మండలంలో చిన్న, సన్నకారుల రైతులకు సంబంధించిన 200 ఎకరాలు భూమి ట్రిపుల్‌ఆర్ నిర్మాణంలో భాగంగా కోల్పోతున్నట్లు తెలిపారు. ట్రిపుల్‌ఆర్ రోడ్డు వంకరటింకరగా నిర్మాణం చేపడుతున్నారని ఎద్దేవా చేశారు. కాగా, భూ బాధిత రైతుల సమస్యలపై నితిన్ గడ్కరీకి ఉత్తరం రాస్తానని కవిత తెలిపారు.

జేపీ దర్గాను అభివృద్ధి చేయండి

కొత్తూర్ : మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తూ రాష్ట్రంలోనే పేరుగాంచిన జేపీ దర్గాను భక్తులకు సౌకర్యార్థం అభివృద్ధి చేయాలని కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం రాత్రి ఇన్ముల్‌నర్వ గ్రామ శివారులో గల హజ్రత్ జహంగీర్ పీర్ దర్గాను కవిత దర్శించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ముజావర్లు ఆమెకు తలపాగా చుట్టి స్వాగతం పలికారు. ఆశీర్వచనాలు, ప్రసాదాలు అందజేశారు. కవిత మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో దర్గా మాస్టర్‌ప్లాన్ అభివృద్ధికి రూ.వంద కోట్లు మంజూరు చేసిందని, ప్రభుత్వం మారిన తర్వాత దర్గా అభివృద్ధిని విస్మరించిందన్నారు. ముస్తాఫా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని విస్మరించిన పాలకులు

మహేశ్వరం : పదిహేను సంవత్సరాలుగా మహేశ్వరం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన ఎమ్మెల్యేలు, మంత్రులు నియోజకవర్గం అభివృద్ధిని మరిచారని కవిత అన్నారు. గురువారం రాత్రి మహేశ్వరం శ్రీ శివగంగ రాజరాజేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. జాగృతి సభ్యులు ఆమెకు ఘనస్వాగతం పలికారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను ఏమాత్రం అమలు చేయలేదన్నారు. మహేశ్వరం రాజరాజేశ్వరాలయాన్ని పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతామని హామీలు ఇచ్చిన ఇక్కడి పాలకులు విస్మరించారన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం



ఇబ్రహీంపట్నం : పోస్టర్ ఆవిష్కరిస్తున్న సూపర్‌వైజర్ పల్లవి

ఇబ్రహీంపట్నం, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఈ విషయంలో విద్యార్థులు, యువత అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పల్లవి అన్నారు. గురువారం ఇబ్రహీంపట్నం మండల పరిధి నాగన్‌పల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై విద్యారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. బాల్య వివాహాల నిరోధించడంపై విద్యార్థులు వ్యాస రచన, డ్రాయింగ్, రంగోలీ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులందజేశారు. ఈ సందర్భంగా బాల్య వివాహాల నిరోధంపై ప్రచార పోస్టర్‌ను విడుదల చేశారు. హెచ్ఎం నందిత, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ టీచర్లున్నారు.

కడ్తాల్ : బాల్య వివాహాలు చేసినా, ప్రోత్సహించినా చర్యలు తప్పవని ఆమనగల్లు సీడీపీవో శాంతిరేఖ, ఐసీడీఎస్ సూపర్ వైజర్‌లు కవిత, మమతలు అన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్, ముద్విన్ జెడ్పీహెచ్ఎస్‌లలో గురువారం నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఆయా చోట్ల జరిగిన కార్యక్రమాలకు సీడీపీవో, సూపర్ వైజర్లు హాజరై విద్యార్థినీ విద్యార్థులకు మాదక ద్రవ్యాలు, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరించారు. రఘుపతి, శ్రీధర్, సతీష్, అంగన్‌వాడీ టీచర్లు, ఆశాకార్యకర్తలున్నారు.

చేవెళ్ల : బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతి ఒక్కరూ అవగాహన కల్గి ఉండాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారి భానుప్రకాశ్ తెలిపారు. కౌకుంట్ల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాల్య వివాహలు జరిపితే రూ.లక్ష జరిమానాతోపాటు రెండు సంవత్సరాల జైలు శిక్ష పడుతుందన్నారు. బాల్యవివాహాలు జరిపితే డయల్ 1098కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శకుంతల, ఉపాధ్యాయులు, టీచర్లు పాల్గొన్నారు.

కొత్తూర్ : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ దీప్తి అన్నారు. కేజీబీవీలో బేటీ బచావో-బేటీ పడావో కార్యక్రమంలో భాగంగా బాల్య వివాహాల నిర్మూలనపై ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేవతి అవగాహన కల్పించారు. పాఠశాల స్పెషల్ ఆఫీసర్ శారదప్రియాంక, సీహెచ్‌వో నాగేష్, అంగన్‌వాడీ టీచర్లు సుమిత్ర, అనిత, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుండెపోటుతో అయ్యప్ప భక్తుడు మృతి

- శబరిమలలో దర్శనం వేళ ఘటన



మల్లికార్జున్‌రెడ్డి(ఫైల్)

శంకర్‌పల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): శబరిమల యాత్రలో ఘోర విషాదం చోటుచేసుకుంది. అయ్యప్ప దర్శనానికి వెళ్తున్న ఓ భక్తుడు గుండెపోటుతో కన్నుమూశాడు. ఈ సంఘటన గురువారం మధ్యాహ్నం శబరిమలలో చోటుచేసుకుంది. శంకర్‌పల్లి మున్సిపాలిటీ బుల్కాపూర్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు గుంతల మల్లికార్జున్ రెడ్డి(40) 41 రోజుల అయ్యప్ప దీక్ష ముగించుకొని శబరిమల వెళ్లాడు. గ్రామానికి చెందిన మరో 32మంది స్వాములతో కలిసి ఈనెల 18న ప్రత్యేక బస్సులో శబరిమలకు వెళ్లారు. గురువారం మధ్యాహ్నం స్వామి దర్శనానికి వెళ్తతుండగా మార్గ మధ్యలో ప్రధాన ఆలయానికి చేరుకునే మార్గంలో పవిత్ర పదునెట్టంబడి(18 మెట్లు) ఎక్కేందుకు సిద్ధమవుతున్న సమయంలో తీవ్రమైన గుండెపోటుకు గురయ్యాడు. తోటి భక్తులు భద్రతా సిబ్బందితో కలిసి సీపీఆర్ చేసినా ఫలితం లేకపోయింది. మల్లికార్జున్‌రెడ్డి మృతితో బుల్కాపూర్ గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఆయనకు భార్య లత, ఇద్దరు కవల పిల్లలున్నారు. మృతదేహాన్ని అంబులెన్స్‌లో శబరిమలై నుంచి తోటిభక్తులు స్వగ్రామానికి తరలించారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి..

ఆదిభట్ల, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): అనుమానస్పద స్థితిలో వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు, కుటుంబసభ్యుల కథనం మేరకు.. సైదాబాద్ సరస్వతినగర్ కాలనీకి చెందిన నాగనూలి పర్వతాలు(52) ఆదిభట్ల పరిధిలోని శ్రీనివాస్ ట్రావెల్స్‌లో నాలుగేళ్లుగా డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. గురువారం విధులకు హాజరై మధ్యాహ్నం 2గంటల సమయంలో అనారోగ్యానికి గురికావడంతో సహోద్యోగులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, అంబులెన్స్‌లో వనస్థలిపురంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. డాక్టర్ పరిశీలించి పర్వతాలు మృతిచెందినట్లు ధ్రువీకరించారు. కాగా, అతడి మృతిపై కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పర్వతాలు కుమారుడు రమణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

శంషాబాద్‌లో కాల్పుల కలకలం

- 12 గంటల్లోపు నిందితులను గుర్తించిన పోలీసులు

శంషాబాద్ రూరల్, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మండలంలోని నర్కుడ గ్రామంలో గురువారం తెల్లవారుజామున సమీర్‌దాస్ అనే వ్యక్తిపై ఓ ఆటోడ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు దాడిచేసి ఎయిర్‌గన్‌తో కాల్పులు జరిపారు. ఈ ఘటనలో సమీర్‌దాస్‌కు గాయాలయ్యాయి. గమనించిన అతడి మేనల్లుడు పింటు డయల్ 100కు సమాచారం అందించడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకునేసరికి నిందితులు పరారయ్యారు. దాంతో గాయపడిన సమీర్‌దాస్‌ను ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితులను ఎస్‌వోటీ, సీసీఎస్, స్థానిక పోలీసులు సాంకేతిక పరిజ్ఞానంతో కేవలం 12 గంటల్లోపు గుర్తించారు. నిందితులు ఏ-1 పసుమల్ల చందుగౌడ్, ఏ-2 తూర్పతి కృష్ణను అరెస్టు చేసి వారి నుంచి ఎయిర్‌గన్, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. కేసులో ప్రతిభ చూపించిన పోలీసు అధికారులను ఏసీపీ శ్రీకాంత్‌గౌడ్ ప్రశంసించారు.

ఇసుక లారీ సీజ్.. కేసు నమోదు

చౌదరిగూడ, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): అనుమతులు ఒకచోట అన్‌లోడ్ మరోచోట చేస్తున్న ఇసుక లారీని జిల్లేడ్ చౌదరిగూడ పెట్రోలింగ్ పోలీసులు సీజ్‌చేశారు. జిల్లేడ్ చౌదరిగూడ ఎస్సై విజయ్ తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని లాల్‌పహాడ్‌లో గురువారం షాద్‌నగర్ వైపు నుంచి లాల్‌పహాడ్ చౌదరిగూడ రోడ్డులో ఖాళీ చేసేందుకు ఇసుక లారీ లోడ్‌తో వస్తుండగా పెట్రోలింగ్ పోలీసులు పట్టుకున్నారు. ఇసుక ఖాళీ చేసేందుకు వేబిల్ 17న పొంది 18న షాద్‌నగర్‌లో ఖాళీ చేయాల్సి ఉండగా.. లారీని 20న జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో ఖాళీ చేస్తూ పోలీసులకు పట్టుబడినట్లు ఎస్సై తెలిపారు. లారీని సీజ్‌చేసి డ్రైవర్ సభావత్ సురేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

ఆలయాల భద్రతకు సహకారం అభినందనీయం



పోలీసులకు చెక్కు అందిస్తున్న బ్యాంకు అధికారులు

మొయినాబాద్ రూరల్, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): నగర శివారు మొయినాబాద్ మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న దేవాలయాల భద్రతకు సహకరించడం అభినందనీయమని రాజేంద్రనగర్ జోన్ అదనపు డీసీపీ శ్రీనివాస్‌రావు, చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్‌లు అన్నారు. మొయినాబాద్ మండలంలోని పలు గ్రామాల్లోని దేవాలయాల్లో సోలార్ ఆధారిత సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు సీఎస్ఆర్ కింద ఎస్‌బీఐ, యూనియన్ బ్యాంకులు ముందుకువచ్చాయి. గురువారం చెక్కులను ఆలయం వద్ద డీసీపీ, రంగరాజన్‌లకు బ్యాంకు అధికారులు అందజేశారు.

ప్రజా చైతన్య కార్యక్రమాల్లో ముందుండాలి



సీడీని ఆవిష్కరిస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

తలకొండపల్లి, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): ప్రజాచైతన్య కార్యక్రమాల్లో కవులు, కళాకారులు, ఉపాధ్యాయులు ముందుండాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. ఓటు హక్కు నమోదు, వినియోగంపై ఓటర్లకు విద్యావంతులు అవగాహన కల్పించి ఓటింగ్ శాతం పెంచాలని సూచించారు. తలకొండపల్లి మండలం దేవుని పడకల్‌కు చెందిన వాలీబాల్ యూత్ అధ్యక్షుడు, పీఈటీ కానుగుల మల్లేశ్ రచించి పాడిన ఓట్ల పండుగ వస్తుందే పాటల సీడీని గురువారం హరీశ్‌రావు హైదరాబాద్‌లో ఆవిష్కరించారు. సీడీని రూపొందించిన పీఈటీ మల్లేశ్‌ను ఆయన అభినందించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు సమాజ సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకోవాలన్నారు. నర్సింహ, మల్లేశ్, మహేశ్,మల్లాచారి, హరికృష్ణ, బాలు, రేణుకుమార్, శ్రీశైలం, రాజయోగి, వేదవ్యాసు, శ్రీను, తదితరులు ఉన్నారు.

మారుమూల గ్రామాల అభివృద్ధికి కృషి

ఆమనగల్లు, నవంబరు 20 (ఆంధ్రజ్యోతి): వెనకబడిన మారుమూల గ్రామాలు, గిరిజన తండాలను వేగవంతంగా అభివృద్ధి చేసి ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించి అమలు చేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని ముర్తోజుపల్లి గ్రామస్థులు గురువారం ఎమ్మెల్యేను గ్రామ నాయకుడు కర్నాటి సాయిరెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిశారు. ముర్తోజుపల్లి నుంచి మాడుగుల రోడ్డు వరకు బీటీ రోడ్డు నిర్మాణం, గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని, గ్రామ సమీపంలో ప్రమాదకర బావివద్ద ప్రహరీ నిర్మాణం చేపట్టాలని వినతిపత్రం అందించారు. తిరుపతయ్య, జగన్‌రెడ్డి, శేఖర్, నరేందర్‌రెడ్డి, వీరారెడ్డి, తదితరులున్నారు.

ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలి

చేవెళ్ల, నవంబరు 20(ఆంధ్రజ్యోతి): రైతులు ఉద్యాన పంటల సాగుపై దృష్టి సారించాలని పూల పరిశోధన శాస్త్రవేత్తలు డాక్టర్ జ్యోతి, డాక్టర్ గౌతమిలు తెలిపారు. గురువారం పలుగుట్ట గ్రామంలో కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఫైనలియర్ విద్యార్థుల ఆధ్వర్యంలో గ్రామంలో రైతు సదస్సు నిర్వహించారు. శాస్త్రవేత్తలు మాట్లాడుతూ రైతులు ఉద్యాన పంటలను అధికంగా సాగు చేయాలని, రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీలను అందిస్తున్నాయని తెలిపారు.